
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 5 అక్టోబరు 2025





జమ్మలమడుగులో ఆటో నడుపుతున్న భూపేశ్‌రెడ్డి

# అట్టహాసంగా ఆటో డ్రైవర్ సేవలో..

- పథకం ప్రారంభించిన మంత్రి సవిత
- జిల్లాలో 11,456 మందికి లబ్ధి ● రూ.17.18 కోట్లు జమ
- వేదికపై కూటమి నేతలు
- ఖాకీ చొక్కా వేసుకుని ఆటో తోలిన ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు



పులివెందులలో ఆటో నడుపుతున్న మంత్రి సవిత, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ఆటో డ్రైవర్లకు మెగా చెక్కును అందజేస్తున్న మంత్రి సవిత, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, బీటెక్ రవి తదితరులు



కడపలో ఆటోడ్రైవర్‌లకు మెగా చెక్కును అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు



ఆటో నడుపుతున్న పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, చిత్రంలో పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతారెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఒకదాని వెంట ఒకటి జెట్ స్పీడ్‌తో ప్రారంభిస్తోంది. నాలుగు నెలల వ్యవధిలోనే వరుసగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అదుర్స్ అనిపిస్తున్నారు. ఇప్పటికే డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆ ప్రభావం ఆటోలపై పడింది. దీంతో ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ప్రభుత్వం ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా శనివారం 'ఆటో డ్రైవర్ల సేవలో..' అనే పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి ప్రారంభించారు.

జిల్లాకు సంబంధించి పులివెందులలోని మినీ సెక్రటేరియట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి, జడ్పీటీసీ మారెడ్డి లత, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి, హెచ్‌ఎల్‌సీ డైరెక్టర్ జోగిరెడ్డి 'ఆటో డ్రైవరు సేవలో' పథకాన్ని ప్రారంభించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు అధికార యంత్రాంగంతో కలిసి అట్టహాసంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఏడాదిన్నర పాలనలో ఇచ్చిన హామీలే కాకుండా చెప్పని హామీలను కూడా వంద శాతం నెరవేరుస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పథకం ద్వారా 11,456 మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ.17,18,40,000 ఖాతాల్లో జమ అయిందన్నారు. జిల్లాలో సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆటో, క్యాబ్, ట్యాక్సీలు నడుపుకుని జీవించే పేదలకు ఆటో డ్రైవరు సేవలో.. పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం సంతోషకరమన్నారు. వాహనాల ఫిట్‌నెస్, మరమ్మతులు, ఇతర అవసరాలకు ఈ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ పథకానికి అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ అడగకుండానే ప్రజల అవసరాలు గుర్తించి వారికి ఆర్థిక సాయం అందిస్తున్న కూటమి ప్రభుత్వం దేశానికే స్ఫూర్తిదాయకమన్నారు.

### ఆటో నడుపుకుంటూ..

పులివెందులలో బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పులివెందుల పూలంగళ్ల నుంచి మినీ సెక్రటేరియట్ వరకు ఆటో నడుపుకుంటూ ర్యాలీ నిర్వహించారు. కమలాపురంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి మూడు రోడ్ల కూడలి నుంచి టీడీపీ కార్యాలయం వరకు ఆటో నడుపుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి గాంధీ బొమ్మ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఇక కడపలో అన్నమయ్య సర్కిల్ నుంచి వైఎస్సార్ ఆడిటోరియం వరకు ఆటో ర్యాలీ చేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బి.హరిప్రసాద్, ఎస్.గోవర్ధనరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి తదితరులు వైఎస్సార్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. బద్వేలులో టీడీపీ ఇన్‌చార్జి రితీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపం నుంచి వీరారెడ్డి కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. జమ్మలమడుగులో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం నుంచి పాత బస్టాండు కన్నెలూరు మోటు, టీడీపీ ఆఫీసు, ఆర్టీసీ గ్యారేజీ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. మైదుకూరులో మార్కెట్‌యార్డు చైర్మన్ రవీంద్ర ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలి నుంచి ప్రొద్దుటూరు బైపాస్‌లో కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. నేతలంతా ఖాకీ డ్రెస్సులు వేసి ఆటో డ్రైవర్ల అవతారం ఎత్తారు.



కమలాపురంలో ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

**వీరికే లబ్ధి**

జిల్లావ్యాప్తంగా ఆటోడ్రైవర్ సేవలో.. పథకానికి 11,456 మందికి లబ్ధి చేకూరింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీబీటీ సిస్టం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు.

| నియోజకవర్గం | లబ్ధిదారులు |
|---|---|
| కడప | 2835 |
| కమలాపురం | 1908 |
| పులివెందుల | 1296 |
| బద్వేలు | 1268 |
| మైదుకూరు | 1254 |
| జమ్మలమడుగు | 1333 |
| ప్రొద్దుటూరు | 1562 |

## జిల్లాకు స్వచ్ఛ పురస్కారాలు

- రాష్ట్ర స్థాయిలో 2, జిల్లా స్థాయిలో 48

కడప కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్‌లో భాగంగా రాష్ట్ర స్థాయిలో రెండు, జిల్లా స్థాయిలో 48 స్వచ్ఛ పురస్కారాలు జిల్లాకు వరించాయి. స్వచ్ఛాంధ్ర పురస్కారాలను 6వ తేదీ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలో అందజేయనున్నారు. అదే రోజు సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా స్థాయి పురస్కారాలు ఇస్తారు. స్వచ్ఛ గ్రామ పంచాయతీ విభాగంలో చెన్నూరు గ్రామ పంచాయతీ, స్వచ్ఛ రెసిడెన్షియల్ విభాగంలో పెద్దముడియం మండలం గుండ్లకుంటలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం స్వచ్ఛాంధ్ర పురస్కారాలకు ఎంపికయ్యాయి.

**జిల్లా స్థాయిలో..**

స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డుకు జిల్లా స్థాయిలో కడప కార్పొరేషన్ ఎంపికైంది. ఉత్తమ స్వచ్ఛగ్రామ పంచాయతీల విభాగంలో నాలుగు మండలాలు, ఉత్తమ గ్రీన్ అంబాసిడర్స్ విభాగంలో ఐదుగురు ఎంపికయ్యారు. పట్టణాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, రైతుబజార్లు, బస్ స్టేషన్లు, పరిశ్రమలు వంటి వివిధ విభాగాల్లో అత్యుత్తమ పనితీరు కనబరచిన వారికి అవార్డులు దక్కాయి. ఘన వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, రెడ్యూస్-రీయూజ్ -రీ సైకిల్ చేసే విషయాల్లో సరికొత్తగా ఆలోచనలు చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం విజేతలుగా ఎంపిక చేసిందని శనివారం కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## శక్తిసదన్ అవినీతిమయం

- ఇటువంటి నిర్వాహకులతో ప్రభుత్వానికి చెడ్డపేరు
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నిస్సహాయ మహిళల కోసం ఏర్పాటుచేసిన శక్తిసదన్ అవినీతిమయంగా మారిందని, ఇలాంటి నిర్వాహకులతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మండిపడ్డారు. శక్తిసదన్‌పై పూర్తిస్థాయి విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. శనివారం కడప నగరం వివేకానంద నగర్‌లో భారతరత్నం మహిళా మండలి ఆధ్వర్యంలో కొనసాగుతున్న శక్తిసదన్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. మహిళలు లేకుండానే ప్రతినెల రూ.5లక్షల రూపాయలు ప్రభుత్వ నిధులు కాజేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో ఆమె గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తిసదన్ మహిళల సంక్షేమం కోసం ఏర్పాటు అయిందన్నారు. అయితే ఇక్కడ నిధులు దుర్వినియోగం జరగడం అత్యంత దారుణమని చెప్పారు. నిర్వాహకుల వలన నిజంగా సహాయం అవసరం ఉన్న మహిళలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఇటువంటి పరిణామాలు రాష్ట్రంలోని మహిళా సంక్షేమ కార్యక్రమాలపై ప్రభావం చూపుతాయన్నారు. శక్తిసదన్ నిర్వాహకులు మహిళల సంఖ్యను రోజుకో విధంగా చెబుతున్నారని మండిపడ్డారు. వాస్తవంగా ఇక్కడ మహిళలే లేరని గుర్తించామన్నారు. మహిళలు లేకపోయినా ప్రతినెల రూ.5లక్షలు ప్రభుత్వ నిధులు తీసుకుంటున్నారని, త్వరలో పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని స్పష్టం చేశారు.

## శాంతిభద్రతల కోసం కఠినంగా వ్యవహరిస్తాం

- ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



పులివెందుల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, ఎక్కడా రాజీపడే పరిస్థితి లేదని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం పులివెందుల సబ్‌డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్ఐలతో డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. మాదకద్రవ్యాలపై నిఘా ఉంచుతామన్నారు. పోలీసు అధికారులు అసాంఘిక కార్యకలాపాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ తదితర వాటిపై ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మురళీనాయక్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## 'అన్నమయ్య' రైతుకు తీపి కబురు





- ప్రధాని ధనధాన్య కృషి యోజనకు ఎంపికైన జిల్లా
- దాదాపు 1.70 లక్షల మంది రైతులకు ప్రయోజనం

7

## దసరా ఎగ్జిబిషన్‌లో నిలువు దోపిడీ

- ఎంట్రీ ఫీజు రూ.35కు రూ.80 వసూలు
- వినోద పరికరాలకు రూ.150

7

## చిరువ్యాపారాలపై అతివల ఆసక్తి

- ఇంటికో లక్షాధికారి సర్వేలో గుర్తింపు
- 2964 మంది ఎంపిక



చిరుతిండ్లు తయారు చేస్తున్న మహిళలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే మహిళా దినోత్సవం నాటికి ప్రతి ఇంట్లో ఒక మహిళను లక్షాధికారిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రస్తుతం ఏ వ్యాపారాలు చేస్తున్నారు.. వారికి మరింత చేయూతనిచ్చేలా అదనపు రుణాల అవసరంపై డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఇటీవల సర్వే చేపట్టారు. చిన్న వ్యాపారాల అభివృద్ధి కోసం చాలా మంది మహిళలు రుణాలు కోరుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో ఉమెన్ లెడ్ డేటా పేరిట నిర్వహించిన ఈ సర్వేలో 2,964 మందికి రుణాలు అవసరం అని గుర్తించారు. వీరిలో అత్యధికంగా పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు.

1,097 మంది డెయిరీ నిర్వహణ కోసం రుణాలు అడుగుతున్నారు. 362 మంది వ్యవసాయ పరికరాల కోసం, 209 మంది బట్టల వ్యాపారం కోసం రుణాలు కోరగా.. టైలరింగ్‌తో పాటు బట్టల వ్యాపారానికి 199 మంది రుణం అడుగుతున్నారు. ఇప్పటికే కిరాణా దుకాణాల నిర్వహణ ద్వారా జీవనోపాధి పొందుతున్న మహిళలు తమ వ్యాపారాన్ని విస్తరించి మరింత మెరుగైన జీవనోపాధుల కోసం 181 మంది, పంటల సాగు కోసం 124 మంది, మేకల పెంపకానికి 108 మంది, నేత పనికోసం 103 మంది, గొర్రెల పెంపకానికి 72 మంది, ఫ్యాన్సీస్టోరుల నిర్వహణకు 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా ఆవుల పెంపకానికి 36 మంది, ల్యాండ్రీ నిర్వహణ కోసం 29 మంది రుణం అడుగుతున్నారు. విత్తనపు గొర్రెల పెంపకానికి 29, ఆటో కొనుగోలు కోసం 25, టిఫన్ సెంటర్లకోసం 25, ఆటోమొబైల్ నిర్వహణకోసం 22, బేకరీషాపులకోసం 21, పండ్ల వ్యాపారానికి 13, గాజుల షాపులకోసం 12 దరఖాస్తులు అందాయి. ఇతర యూనిట్ల కోసం 220 మంది స్వయంసహాయక సంఘాల్లోని సభ్యులు రుణాల కోసం సర్వే అధికారులకు తమ వివరాలు నమోదు చేయించుకున్నారు. ఇప్పటికే పలువురు కిరాణా దుకాణాలు, ఇళ్ల వద్ద హోటళ్లు నిర్వహిస్తున్నారు. వీరు వ్యాపారాలను మరింత విస్తరించేందుకు రూ.10వేల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి రుణం కింద అందించేందుకు డీఆర్‌డీఏ అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

### ఆటో మొబైల్ షాపుల కోసం

ఆటో మొబైల్ రంగాల ద్వారా కూడా ఉపాధి పొందేందుకు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు రుణసాయం అందించాలని కోరుతున్నారు. ఈ రంగానికి సంబంధించి జిల్లాలో 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. షాపు కోసం ఆరుగురు, స్కూటరు, ఆటో, మెకానిక్ షెడ్డు కోసం మిగిలినవారు దరఖాస్తు చేసుకున్నారు. ఈ రంగాల్లో ఇప్పటివరకు మహిళలు చాలా తక్కువ ఉన్నారు. ఇప్పుడు ఈ రంగంలోనూ రాణించేందుకు ఉత్సాహాన్ని చూపడం విశేషం. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లతో చర్చించి ప్రతి మహిళకు రుణమందేలా చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు.

## నకిలీ మద్యం తయారీలో 10 మంది అరెస్టు

- ఏ1గా జనార్దన్‌రావు, ఏ5గా రాజేశ్
- విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ జయరాజు



పట్టుబడ్డ కల్తీ మద్యం, సామగ్రి వివరాలు వెల్లడిస్తున్న కడప ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు

రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఎక్సైజ్ ఉన్నతాధికారులు మొత్తం 10 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డికి సన్నిహితుడైన జనార్దన్‌రావును ఏ1గా, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్‌ను ఏ5గా చేర్చారు. ఈ దాడుల్లో 20,208 కల్తీ మద్యం బాటిళ్లు, 1470 లీటర్ల తయారు చేసిన కల్తీ మద్యం, 1050 లీటర్ల స్పిరిట్‌ను, బెల్ట్‌షాపులకు సరఫరా చేసే లగేజి వాహనంతో పాటు రెండు ద్విచక్రవాహనాలు, కల్తీ మద్యం తయారు చేసే అత్యాధునిక పరికరాలను సీజ్ చేసినట్లు కడప ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ కేసులో ఏ2గా కట్టా రాజు, ఏ3, ఏ4లుగా విశాఖపట్నంకు చెందిన సయ్యద్‌హాజీ, వాహన డ్రైవర్ బాలరాజు, ఏ5గా ములకలచెరువుకు చెందిన రాజేశ్, ఏ6, ఏ7, ఏ8, ఏ9గా తమిళనాడుకు చెందిన మణిమారన్, ఆనందన్, సూర్య, సురేశ్ ఏ10, ఏ11గా ఒడిషా రాష్ట్రానికి చెందిన మిథున్, ఆనంద్‌దాస్, ఏ12గా తెనాలికి చెందిన కొడాలి శ్రీనివాసరావు, ఏ13గా పీటీఎం మండలం కమ్మవారిపల్లెకు చెందిన కట్టా సురేంద్రనాయుడు, ఏ14గా పీటీఎం మండలం రంగసముద్రంకు చెందిన బెల్ట్‌షాపు నిర్వాహకుడు నాగరాజు ఉన్నారు ఇందులో జనార్దన్‌రావు, కట్టా రాజు, రాజేశ్, కొడాలి శ్రీనివాసులు మినహా 10 మందిని అరెస్టు చేశారు. మిగిలిన నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను నియమించి గాలింపు చర్యలు చేపట్టారు.

**ఆంధ్ర వైన్స్ మద్యం దుకాణం సీజ్**

పెద్దతిప్పసముద్రం మండలం చెన్నరాయనిపల్లె సమీపంలో ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దులో ఉన్న ఆంధ్ర వైన్స్‌ను ఎక్సైజ్ ఉన్నతాధికారులు సీజ్ చేశారు. మద్యం దుకాణం యజమాని కట్టా సురేంద్రనాయుడు ఇంట్లో కల్తీ మద్యం దొరకడంతో ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ విషయాన్ని కడప ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు విలేకరుల సమావేశంలో తెలిపారు.

### పట్టించిన వాహనం

ములకలచెరువు నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బెల్ట్‌షాపులకు నకిలీ మద్యం సరఫరా చేస్తున్న వ్యానే గుట్టురట్టు అయ్యేందుకు ఉపయోగపడింది. ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో మూడు రోజుల పాటు ఇక్కడ నిఘా వేసి కల్తీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని వెంబడించారు. ములకలచెరువులోని పాత డాబా దగ్గరకు వస్తుందన్న విషయం గుర్తించి దాడులు చేశారు. కల్తీ మద్యం తీసుకెళ్తున్న వ్యానును అనుమానం వచ్చి ఎవరైనా నిలిపి అడిగితే పాలు తీసుకెళుతున్నట్లు బుకాయించేవారు. పాల రవాణా మాటున కల్తీ మద్యం సరఫరా చేశారు.

### ఇక్కడ తయారైన కల్తీ బ్రాండ్‌లు ఇవే

ములకలచెరువు కేంద్రంగా బెంగళూరు బ్రాందీ, ఓల్డ్ అడ్మిరల్, కేరళ మాల్ట్ విస్కీలు ఉన్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా అచ్చు అసలు మద్యం బాటిళ్లలాగే లేబుళ్లు, బాటిల్ మీద స్కాన్ చేసే స్టిక్కర్లను అంటిస్తున్నారు. ములకలచెరువులో భారీగా పట్టుబడ్డ నకిలీ మద్యం బాటిళ్ల శాంపుల్స్‌ను చిత్తూరు ల్యాబ్‌కు పంపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి



జమ్మలమడుగు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ముద్దనూరు రోడ్డులోని పెన్నానది వంతెనపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దచౌరెడ్డి (55) వ్యక్తి మృతి చెందాడు. జమ్మలమడుగు మండలం అంజనాపురం గ్రామానికి చెందిన పెద్దచౌరెడ్డి ముద్దనూరు రోడ్డువైపు నుంచి ద్విచక్రవాహనంలో జమ్మలమడుగుకు బయల్దేరాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం రాత్రి కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈయన కుమారుడు మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందాడని మృతుడి బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య




మృతుడి శరీరంపై ముందు భాగంలో స్పోర్ట్స్ టీషర్టుపై నారాయణ మెడికల్ కాలేజీ, వెనుక వైపు చేతన్ అని ఉన్న దృశ్యం

ముద్దనూరు అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల సమీపంలో శనివారం గుర్తుతెలియని యువకుడు (30) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రగుంట్ల రైల్వే పోలీసుల సమాచారం మేరకు... మృతుని వద్ద జమ్మలమడుగు నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసినట్లు టికెట్ ఉందని, శరీరంపై స్పోర్ట్స్ టీషర్టు ఉందని, దానిపై ముందు భాగంలో నారాయణ మెడికల్ కాలేజి 2020, వెనుక చైతన్ అని ప్రింట్ ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు, ఆచూకీ తెలిసిన వారు ఎర్రగుంట్ల పోలీసులను సంప్రదించాలన్నారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

చాపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరాయిపల్లె గ్రామం వంక బ్రిడ్జి వద్ద శనివారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఎరుపురంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. అతని ఆచూకీ తెలిసినవారు 9121100601 అనే నంబరుకు తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు

కాశినాయన అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నాయపల్లెకు చెందిన గుర్రాల రమణారెడ్డిపై అదే గ్రామానికి చెందిన గుర్రాల రాజకుమార్‌రెడ్డి దాడికి పాల్పడ్డారు. రాజకుమార్‌రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్‌ఐ వివరాలమేరకు.. నాలుగేళ్ల క్రితం రామణారెడ్డి వద్ద రాజకుమార్‌రెడ్డి డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా ఎదురు తిరిగి గొడ్డలితో దాడి చేసి రమణారెడ్డిని గాయపరిచాడు. అతన్ని కడప రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## చింతలకుంటలో అగ్ని ప్రమాదం

- రూ.10 లక్షలు నష్టం



అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిలో మంటలు

నందలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ప్రాంతమైన చింతలకుంట గ్రామం హరిజనవాడలో బల్లి ఓబులేశు అనే వ్యక్తి ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.10 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. బాధితుల వివరాల మేరకు.. శనివారం ఉదయం ఉదయం 10 గంటల సమయంలో ఇంటిలోని ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాప్తి చెందాయి. ఈ సంఘటనలో రూ.2.50 లక్షల నగదు, బంగారు, ఇంటిలోని పలు రకాల వస్తువులు, దుస్తులు కాలపోయాయని వాపోయింది. రాజంపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.


# 'అన్నమయ్య' రైతుకు తీపి కబురు

- ప్రధాని ధనధాన్య కృషి యోజనకు ఎంపికైన జిల్లా
- దాదాపు 1.70 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- ప్రతి ఏటా జిల్లాకు రూ.240 కోట్లు
- ఈ ఏడాది రబీ నుంచే ప్రారంభం.. ఆరేళ్లపాటు అమలు
- పర్యవేక్షణకు కేంద్రం నుంచి ప్రత్యేక అధికారి

కలికిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు కేంద్రం తీపి కబురు అందజేసింది. ఏడేళ్లుగా ఊరిస్తున్న జిల్లా రైతు ప్రయోజనాల పథకం ఎట్టకేలకు నెరవేరింది. ప్రధాని ధనధాన్య కృషి యోజన పథకం కింద జిల్లా ఎంపికైంది. మొత్తం దేశంలో వ్యవసాయంలో వెనుకబడిన వంద జిల్లాలను ఈ పథకం కింద ఎంపిక చేయగా ఏపీ నుంచి నాలుగు జిల్లాలకు అవకాశం దక్కింది. అల్లూరి సీతారామరాజు (ఏఎస్‌ఆర్), శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాలను ఎంపిక చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. జిల్లాలోని లక్షా 70 వేల మంది రైతులకు ఈ పథకం కింద అనేక రకాల ప్రయోజనాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అందనున్నాయి. దీని కోసం మొత్తం ఏడాదికి రూ.24 వేల కోట్లు కేటాయించగా అందులో జిల్లా వాటాగా ఏడాదికి రూ.240 కోట్లు అందనున్నాయి. ఈ ఏడాది అక్టోబరు రబీ సీజన్ నుంచి ఇది ప్రారంభం కానుంది. ఆరేళ్లపాటు ఈ పథకం అమలులో ఉంటుంది. దీనికవసరమైన నిధులను గత బడ్జెట్‌లోనే ప్రతిపాదించి ఆమోదించారు. ఈ మేరకు అప్పట్లోనే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గత ఫిబ్రవరి 1న ప్రకటించారు. బడ్జెట్ కేటాయింపులు పూర్తయిన అనంతరం వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో దేశ వ్యాప్తంగా తీవ్రంగా వెనుకబడిన 120 జిల్లాలను గుర్తించారు. అందులో చివరికి 100 జిల్లాలను ఎంపిక చేశారు. అందులో ఏపీ నుంచి వ్యవసాయ ఉత్పాదక రంగాల్లో ఆశించిన ఫలితాలు సాధించలేక వెనుకబడిన నాలుగు జిల్లాలు ఎంపికయ్యాయి. అందులో అవకాశం దక్కడం జిల్లా రైతాంగానికి పెద్ద ఉపశమనంగా చెబుతున్నారు. ఈ పథకాన్ని పటిష్టవంతంగా అమలు చేసి నేరుగా రైతు ముంగిటకు ప్రయోజనాలను చేర్చడానికి అనేక రకాల చర్యలు చేపడుతున్నారు.

### నీతి ఆయోగ్ పర్యవేక్షణలో

ధనధాన్య కృషి యోజన పథకాన్ని నీతి ఆయోగ్ పర్యవేక్షించనుంది. వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, కేవీకేలు ఇతర వ్యవసాయ విస్తరణాంశాలను సమన్వయం చేసి పూర్తి స్థాయిలో ఒక డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించనుంది. జిల్లా స్థాయిలో కలెక్టరు ఆధ్వర్యంలో కమిటీలు, రాష్ట్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 11 మంత్రిత్వ శాఖల ద్వారా అమలవుతున్న 36 వివిధ రకాల పథకాలను దీనికి అనుసంధానించనున్నారు. మొత్తం 117 పనితీరు సూచికల ద్వారా పథకం అమలును, ఫలితాలను ఎప్పటికప్పుడు క్రోడీకరించి ఫలితాలను విశ్లేషించనున్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెంచడం, పంటల్లో వైవిధ్యత, రుణాలను పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లోనే అవకాశాలను సృష్టించడంలాంటి అంశాలపై నీతి ఆయోగ్ దృష్టి సారించనుంది. పంట నష్టాలను తగ్గించుకోవడానికి కోతల అనంతరం నిల్వ సామర్థ్యాలను పెంచడానికి గ్రామ, మండల స్థాయిలో సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నారు. పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేయనున్నారు. యూరియా కొరత లేకుండా సరఫరాకు ప్రాధాన్యమివ్వనున్నారు. మొత్తానికి సంప్రదాయం పంటల నుంచి ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో వాణిజ్య పంటలపై దృష్టి పెట్టనున్నారు. అదే విధంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తుల కోసం సమగ్ర ప్రణాళిక అమలు చేయనున్నారు.




### పథకం నేపథ్యమిదీ!

పీఎం ధనధాన్య కృషి యోజన పథకం వెనుక పెద్ద కథనమే ఉంది. విభజిత ఏపీలో వెనుకబాటు జిల్లాలైన రాయలసీమ, ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళంలకు ప్రత్యేక ప్రాధాన్యాలను ఉమ్మడి రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచారు. 2014-19 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ ప్రత్యేక ప్రయోజనాల నిధులను రాబట్టడానికి తీవ్రంగా ప్రయత్నించారు. చివరికి దీనిపై 2018లో ప్రధాని మోదీ సానుకూలంగా ప్రకటన చేసినా ఆ తరువాత కేంద్రంతో సత్సంబంధాలు లేకపోవడంతో అప్పట్లో కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు దీని ఊసెత్తలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తరచూ కేంద్రంపై ఒత్తిడి పెంచడంతో మొన్నటి కేంద్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న దీని గురించి ప్రకటన చేశారు. బడ్జెట్‌కు ఆమోదం లభించడంతో జూలై 16న కేంద్ర మంత్రివర్గం దీనిని ఆమోదించింది. అప్పటి నుంచి జిల్లాల ఎంపికపై జరిగిన కసరత్తు పూర్తి కావడంతో శుక్రవారం దీని విధివిధానాలను కేంద్రం ప్రకటించింది. అయితే ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రమే రెండు జిల్లాలను ఎంపిక చేశారు. ఉమ్మడి కడప, చిత్తూరులో నాలుగు జిల్లాలున్నా చివరికి కేవలం ఒక్క అన్నమయ్యకు మాత్రమే అవకాశం లభించింది. ఇక ఏజెన్సీ జిల్లా ఏఎస్‌ఆర్ కూడా స్థానం దక్కించుకుంది.

### జిల్లా పర్యవేక్షణకు కేంద్ర అధికారి



బాలమురుగన్

ఆరేళ్ల కాలం.. ఏడాదికి రూ.240 కోట్లు, దాదాపు లక్షా 70 వేల మంది రైతుల ప్రయోజనాలు, దీర్ఘకాలిక ఫలితాలు.. ఈ కారణంగానే మొక్కుబడిగా నిధులు కేటాయించడం కాకుండా పథకాలను అనుక్షణం పర్యవేక్షించి ఫలితాలు రాబట్టడానికి నేరుగా కేంద్రమే అమలు బాధ్యత చేపట్టింది. ఇందులో భాగంగా పర్యవేక్షణ కోసం ఒక్కో జిల్లాకు కేంద్ర నుంచి ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ అధికారులుగా నియమించారు. అన్నమయ్యకు సంబంధించి తమిళనాడుకు చెందిన ఐఏఎస్ (2005 బిహార్ కేడర్) అధికారి డి.బాలమురుగన్‌ను నియమించారు. ఈయన ప్రస్తుతం కేంద్రంలో కార్పొరేట్ వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీగా ఉన్నారు. స్వతహాగా వ్యవసాయ పట్టభద్రుడైన బాలమురుగన్ బిహార్‌లో ఆరు జిల్లాల్లో కలెక్టరుగా పనిచేసిన అనుభవముంది. జిల్లాలో రబీ సీజన్ నుంచి నోడల్ అధికారి బాలమురుగన్ ధనధాన్య కృషి యోజన పథకం అమలును చేపట్టనున్నారు. ప్రధానంగా జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, మార్కెటింగ్ శాఖలు చురుగ్గా వ్యవహరించాల్సి ఉంది. మొత్తం 11 వివిధ మంత్రిత్వ శాఖలు, వాటి ద్వారా అమలవుతున్న 36 రకాల పథకాలను ధనధాన్య కృషి యోజనతో సమన్వయం చేయనున్నారు.

## వాటర్ గ్రిడ్ పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్

లింగాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వాటర్ గ్రిడ్ పనులు నత్తనడకన సాగుతున్నాయని.. పనుల్లో వేగం పెంచి డిసెంబరు 15వ తేదీ నాటికి పులివెందుల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పార్నపల్లె గ్రామ సమీపంలో రూ.450కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పనులను, సీబీఆర్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో సాగు, తాగునీటి కొరత రాకుండా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పీబీసీ, లింగాల కుడికాల్వ పరిధిలోని అన్ని చెరువులను నింపాలన్నారు. అలాగే సీబీఆర్ ప్రాజెక్టు మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. హెచ్‌ఎల్‌సీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ సీబీఆర్ పరిధిలోని ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆర్‌డీఓ చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఏడుకొండలు, పీబీసీ ఈఈ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.



సీబీఆర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

## ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్‌కు వాల్మీకిపురం క్రీడాకారుడు



వాల్మీకిపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్‌లో వాల్మీకిపురానికి చెందిన దీపన్‌సాయినాథ్ ఎంపికైనట్లు హెడ్ కోచ్ సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక జీవీఎస్‌సీఎస్ మైదానంలో ఏసీఏ ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్యాంపులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఎంపికైనట్లు తెలియజేశారు. మదనపల్లె జోన్ నుంచి మొదటిసారి రంజీ ప్రాబబుల్స్‌కు దీపన్ సాయినాథ్ ఎంపికవడం పట్ల స్థానిక అసోసియేషన్ పెద్దలు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

## రైల్వేకోడూరులో భారీ వర్షం



జలమయమైన కోడూరు-తిరుపతి రహదారి

రైల్వేకోడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. పాదచారులు పలు ఇక్కట్లకు గురయ్యారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు వర్షం కురవడంతో రైల్వేకోడూరు-తిరుపతి మార్గంలో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. రైల్వేకోడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, ప్రధాన రహదారి, తదితర వీధి రోడ్లు జలమయమయ్యాయి. వ్యాపార దుకాణాల్లోకి వర్షపు నీరు ప్రవేశించడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.



జలమయమైన రైల్వేస్టేషన్ రోడ్డు

## పట్టాభిరాముడి పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టాభిరామాలయంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ శనివారం టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యే క పూజలు జరిగాయి. సాయంత్రం కలశస్థాపన చేసి స్వామివారి పవిత్రోత్సవాలకు విశేష భక్తజనం నడుమ అంకురార్పణ చేశారు.

కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాల, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, భాషికాచార్యులు, కృష్ణరాజు, గోకుల్, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కడప మారుతీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప-రాజంపేట రోడ్డులోని గర్ల్స్ ఐటీఐ కాలేజీ పక్కన గల శిక్షణ సంస్థలో కెనరా బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టరు ఆరిఫ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని 18 నుంచి 45 సంవత్సరాల్లోపు గల వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

## నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని కడప జిల్లా అపుస్మా ఆధ్వర్యంలో ఆదివారం ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అపుస్మా జిల్లా అధ్యక్షుడు బి.గంగయ్య, సెక్రటరీ, శివశంకర్‌రెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు ఎంవీ రామచంద్రారెడ్డి, బి.రామగోపాల్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఆర్జేడీ శ్యామ్యూల్, డీఈఓ షంషుద్దీన్, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్, రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు.


## 32 మద్యం బాటిళ్లు స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

కడప క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవుని కడప దగ్గరలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 32 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్‌ఐ రాజ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేర కు అతన్ని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.



## దసరా ఎగ్జిబిషన్‌లో నిలువు దోపిడీ

- ఎంట్రీ ఫీజు రూ.35కు రూ.80 వసూలు
- వినోద పరికరాలకు రూ.150



ప్రొద్దుటూరు దసరా ఎగ్జిబిషన్ కాంతులు

ప్రొద్దుటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు దసరా సంబరాల్లో భాగంగా మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. మున్సిపాలిటీ గెజిట్ ప్రకారం పెద్దలకు రూ.35, పిల్లలకు రూ.25లు ఎంట్రీ టికెట్లు నిర్ణయించగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు మొదటి రోజు నుంచి ఎంట్రీ ఫీజు రూ.50 వసూలు చేస్తున్నారు. విజయదశమి రోజు రూ.100 వసూలు చేయగా, ఆ తరువాత రోజు నుంచి రూ.80 వసూలు చేస్తున్నారు. వినోద పరికరాలకు సైతం విజయదశమి రోజు రూ.100 టికెట్లు నిర్ణయించగా రూ.150 వసూలు చేశారు. ఎగ్జిబిషన్‌లో ఏదైనా తినాలని చూసినా ధరలు డబుల్ త్రిబుల్ వసూళ్లు చేస్తున్నారు. వాటర్ బాటిల్ రూ.40, కూల్ డ్రింక్స్ రూ.50 గోబి, నూడిల్స్ ఏదైనా రూ.60 ముక్కుపిండి తీసుకుంటున్నారు. ఈ తీరుగా ఎంట్రీ టికెట్ల దగ్గర నుంచి అన్ని రకాల వినోద పరికరాలతో పాటు తినుబండరాలు సైతం అధిక రేట్లకు విక్రయించి ప్రజలను వినోదం పేరిట నిలువు దోపిడీ చేస్తున్నా మున్సిపల్ అధికారులు అటు వైపు తొంగి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### మున్సిపాలిటీకి రూ.2.25 కోట్లు లీజు చెల్లించకుండా...

ఎగ్జిబిషన్ నిర్వాహకులు మున్సిపాలిటీకి పూర్తిగా లీజు చెల్లించాకే అనుమతి ఇవ్వాలని గెజిట్‌లో ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు లీజు మొత్తం చెల్లించకనే ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతులు ఇవ్వడంపై వైసీపీ మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు అధికార టీడీపీ మండల స్థాయి నాయకుడు కావడంతో మున్సిపల్ అధికారులు అధికార పార్టీ పెద్దల ఒత్తిళ్లకు లొంగి అనుమతులు ఇచ్చారు. మొత్తం రూ 2.25 కోట్లు చెల్లించాల్సి ఉంటే.. ఇప్పటి వరకు రూ.90లక్షలు మాత్రమే చెల్లించినట్లు మున్సిపల్, రెవెన్యూ అధికారులు వెల్లడిస్తున్నారు. దసరా పర్వదినాల్లో ఎగ్జిబిషన్‌లో ఎంట్రీ ఫీజు, వినోద పరికరాలకు సంబంధించి మున్సిపల్ గెజిట్ ధరల పట్టికను మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీలు వేసి ప్రదర్శించక పోవడంపై ఆరోపణలున్నాయి. నిర్వాహకులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి వారికి సహకరించారని సమాచారం.

### అధిక వసూళ్లపై చర్యలు తీసుకుంటాం

ఎంట్రీ ఫీజు అధికంగా వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ గెజిట్ ప్రకారం ఎంట్రీ ఫీజుతో పాటు వినోద పరికరాలు, తినుబండరాల ధరలు ఫ్లెక్సీలు వేసి ప్రదర్శిస్తాం. గడువు లోపు లీజు మొత్తంను వసూలు చేస్తాం.

– రమేష్, మున్సిపల్ ఆర్‌ఐ

## భవనాలను పరిశీలించిన కలెక్టర్



పులివెందుల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తొండూరు వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను నిర్వహించేందుకు ప్రైవేటు భవనాలను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. శనివారం సాయంత్రం ఆయన పులివెందుల రింగురోడ్డులో ఉన్న న్యాక్‌బిల్డింగ్ సమీపంలోని ఇస్టా భవనాలను పరిశీలించారు. తొండూరు వద్దఉన్న గురుకుల పాఠశాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ భవనాలు పూర్తికాక పాఠశాలను ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. అక్కడ విద్యార్థులు చాలీచాలని గదులతో ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ నుంచి మరొక చోటకు మార్చేందుకు ఈ భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిత, హెచ్‌ఎల్‌సీ ఛైర్మన్ జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్ డీఎస్పీగా నాగేశ్వర్‌రావు



కడప క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ డీఎస్పీగా పి.నాగేశ్వర్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. 1996 సంవత్సరంలో ఆర్‌ఎస్‌ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి విశాఖపట్టణం రూరల్, విజయనగరం తదితర జిల్లాల్లో విధులు నిర్వర్తించారు. 2010 సంవత్సరంలో ఆర్‌ఐగా పదోన్నతి పొంది విజయనగరం పీటీసీ, విశాఖపట్టణంలో పనిచేశారు. 2022లో డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా వైఎస్‌ఆర్ కడప జిల్లాకు బదిలీపై వచ్చారు.

## రోడ్లు, కాల్వల సమస్యలను పరిష్కరించండి

కమిషనర్ మనోజ్‌రెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):రోడ్లు, కాల్వల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. శనివారం కడపనగరం నార్త్‌జోన్ పరిధిలో విస్తృత పర్యటన నిర్వహించారు. 38వ డివిజన్ ప్రాంతాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడి చెత్త సేకరణ, కాల్వల పూడికల తొలగింపు వంటి అంశాలను ప్రత్యక్షంగా విచారించారు. కొత్తగా ఇళ్లు నిర్మిస్తున్న యజమానులు తప్పనిసరిగా మున్సిపల్ అనుమతులు తీసుకోవాలని సూచించారు.

# ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి సవిత, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డి





పులివెందుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, కమలాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

పులివెందుల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ మాట నిలబెట్టుకున్న ప్రభుత్వంగా నిలిచిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సాంఘిక సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం ఉదయం పులివెందుల పూలంగళ్ల కూడలి నుంచి మినీ సెక్రటేరియట్ వరకు మంత్రి ఆధ్వర్యంలో ఆటోల ర్యాలీ సాగింది. మినీ సెక్రటేరియట్ ఆవరణంలో ఆర్డీఓ చిన్నయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్ల అభివృద్ధి కోసం రూ.15వేలు ఒకేసారి అకౌంట్‌లోకి జమచేసి ఆయన ఉన్నతిని చాటుకున్నారన్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు రూ.15వేలు అందించడంతో కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతోందన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఆటో, క్యాబ్, ట్యాక్సీలను నడుపుకొని జీవించే డ్రైవర్లకు ఈరోజు అందించిన రూ.15వేలు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఆటో, క్యాబ్ డ్రైవర్ల అవసరాలను, ఇబ్బందులను గుర్తించి రూ.15వేలు ఆర్థిక సాయం అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. అనంతరం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, పులివెందుల స్పెషలాఫీసర్ రాజ్యలక్ష్మి, హెచ్‌ఎల్‌సీ ఛైర్మన్ మారెడ్డి, జోగిరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతారెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, తొండూరు మండల మాజీ ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, డీఎస్పీ మురళీనాయక్, సీఐలు రమణ, సీతారామిరెడ్డి, నరసింహులు, ట్రాఫిక్ సీఐ హాజీవల్లి పాల్గొన్నారు.

**కమలాపురం రూరల్..:** ఆటో డ్రైవర్లు, కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా మూడు రోడ్ల కూడలి నుంచి టీడీపీ కార్యాలయం వరకు ఎమ్మెల్యే ఆటో నడిపి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ యువగళంలో ఇచ్చిన హామీ మేరకు ఆటోలపై గ్రీన్‌ట్యాక్స్ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో తగ్గించామన్నారు. పాతవాహనాలపై ఉన్న గ్రీన్‌ట్యాక్స్ రూ.20 వేలను రూ.3వేలకు తగ్గించామన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కమలాపురం నియోజకవర్గంలో 1908 ఆటోలు ఉన్నాయని, ఒక్కో ఆటోకు రూ.15వేలు ఆర్థిక సాయం చేయడం వల్ల రూ2,86,20,000 లబ్ధిదారుల అకౌంట్లలో పడిందన్నారు. అనంతరం ఆటో కార్మికులకు మెగా చెక్కును అందజేశారు. ఆర్డీవో జాన్ ఎర్విన్, తహసీల్దారు శివరామిరెడ్డి, ఈవోఆర్‌డీ కెజియా, టీడీపీ నాయకులు రాఘవరెడ్డి, ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, వాసుదేవరెడ్డి, శివారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, దాదిరామయ్య, జంపాల నరసింహారెడ్డి, గంగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**కడప ఎర్రముక్కపల్లె..:** ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపనగరం వైఎస్సార్ ఆడిటోరియంలో మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి అధ్యక్షతన ఆటో డ్రైవర్ సేవలో పథకాన్ని ఆయన ప్రారంభించారు.కడప నియోజకవర్గం పరిధిలో



కడపలో ర్యాలీగా వస్తున్న ఆటో డ్రైవర్లు, కూటమి నాయకులు

2835 మంది ఆటో కార్మికుల ఖాతాల్లో రూ.4.25కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసింది. సంబంధిత చెక్కును ఆటో డ్రైవర్లకు ఆయన అందజేశారు. ముందుగా కడప నగరంలోని అప్సర సర్కిల్ నుంచి ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, జనసేన నాయకుడు విశ్వనాథ్,రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శికడప నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

## 7న వాల్మీకి జయంతి వేడుక

కడప కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 7న మంగళవారం ఉదయం 9.30గంటలకు కడప ట్రాఫిక్ పోలీసుస్టేషను ఎదురుగా గల వాల్మీకి విగ్రహం వద్ద వేడుక కార్యక్రమం జరగనుంది. అనంతరం ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ కార్యాలయం పీజీఆర్‌ఎస్ హాలులో జయంత్యుత్సవం ఉంటుంది. పై కార్యక్ర మంలో జిల్లాలోని అధికారులు, అనధికారులు, బీసీ సంఘం నాయకులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని సంబంధిత అధికారులు కోరారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు కడప జట్టు

పులివెందుల రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జర్నలిస్టు క్రికెట్ టోర్నమెంట్‌కు కడప క్రికెట్‌జట్టు శనివారం రాత్రి బయలుదేరింది. ఈ సందర్భంగా శనివారం రాత్రి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, గుణకనపల్లె అమర్‌నాథ్‌యాదవ్, అర్బన్ సీఐ సీతారామిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరగనున్న జర్నలిస్ట్ టోర్నమెంట్‌లో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు జట్లు తలపడనున్నాయని, ఈసందర్భంగా కడప జట్టు విజేత కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్, కెప్టెన్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ ప్రాంత నీటి హక్కులను కాపాడాలి

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచే ప్రయత్నం సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘిస్తున్నదని, ఈ దుర్మార్గాన్ని ఆపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించాలని, కేంద్రం జోక్యం చేసుకోవాలని రాయలసీమ ఆకాంక్షల వేదిక కన్వీనర్ ఎ.రఘునాథరెడ్డి ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. ఈ పెంపు వల్ల కర్ణాటక 150టీఎంసీల నీటిని నిల్వ చేసి, 250టీఎంసీని అక్రమంగా వినియోగించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలి

## కొవ్వొత్తులతో నిరసన



కార్పొరేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సచివాలయ సిబ్బంది

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సచివాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట సచివాలయ ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ విధుల నుంచి విముక్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వరప్రసాద్, హస్తినాపురం శివ,సుందర్ రాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'మద్యంలో వైసీపీ, కూటమి దొందూ దొందే'

వేంపల్లె, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని ఏరులై పారించడంలో వైసీపీ, కూటమి ప్రభుత్వాలు దొందూ దొందుగా మారాయని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్టుషాపులు అన్న చందంగా తయారయ్యాయని తెలిపారు. నకిలీ మద్యం తయారీ కేంద్రాలు విచ్చలవిడిగా వెలిశాయని, అన్నమయ్య జిల్లాలో పలుచోట్ల నకిలీ మద్యం దొరకడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల కల్తీ మద్యంతో మృత్యుపాలయ్యారని, కుటుంబాలు నాశనం అయ్యాయని ఆవేదన వెలిబుచ్చారు. సంపూర్ణ మద్య నిషేదం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తంకండి

కడప మారుతీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని నియోజకవర్గాల కార్యకర్తలు సంసిద్ధం కావాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఆ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్ సమీపంలో గల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న కమలాపురం నియోజకవర్గంలో 8న బద్వేలు, 9న మైదుకూరు, 10న ప్రొద్దుటూరు, 11న జమ్మలమడుగు, 12 పులివెందుల, 13న కడప నియోజక వర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ నాయకులు మల్లయ్య, బీసీ గంగులు, ఎస్వీ రమణ, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రైవేట్ ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోండి'

కడప సెవెన్ రోడ్స్ అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దసరా పండుగ సీజన్‌లో ప్రజల వద్ద నుంచి అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ పై రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం ఎందుకని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని డిమాండ్ బట్టి బస్సు టికెట్లను పెంచుకుంటూ పోతున్నా జిల్లాలో రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కడప, ప్రొద్దుటూరు రవాణా శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు.

## 'సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం'

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఫ్యాప్టో ప్రతినిధులు విమర్శించారు. సమస్యలు పరిష్కరించుకుంటే ఈనెల 7వ తేదీన విజయవాడలో మహాధర్న నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. శనివారం కడప నగరం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇక్బాల్, ప్రవీణ్ కిరణ్ ర్యాలీ నిర్వహించారు. మహవీర్ సర్కిల్ నుంచి డీఈఓ కార్యాలయం వరకు జరిగిన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బాలగంగిరెడ్డి, నరసింహరావు, చెన్నకేశ్వరరెడ్డి, సాజిద్, గంగన్న,గాజులపల్లె గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో ప్రతినిధులు

## రైతులకు అందుబాటులో యూరియా

కమలాపురం రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలానికి 80 టన్నుల యూరియా మంజూరైందని సోమవారం నుంచి రైతులు తీసుకెళ్లవచ్చని ఏవో సరస్వతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ యూరియా అవసరమైన రైతులు తప్పనిసరిగా పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు. ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకున్న రైతులకు పంటసాగు చేసే రైతులకు మాత్రమే యూరియా పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.

# ఆటో డ్రైవర్ల సంక్షేమమే కూటమి లక్ష్యం


ప్రొద్దుటూరులో మెగా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరద


మైదుకూరులో ఆటోడ్రైవర్ల ర్యాలీలో పాల్గొన్న పాల్గొన్న అధికారులు, నాయకులు


జమ్మలమడుగులో మెగా చెక్ అందజేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ, భూపేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలతో పాటు ఇవ్వని వాగ్దానాలను సైతం అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగమే ఆటో డ్రైవర్ల సేవ పథకమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్దనుంచి ఆటో డ్రైవర్ల ర్యాలీని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా ఆటో కార్మికుల ఉపాధికి దెబ్బ పడకూడదని వారిని ఆదుకోవడానికి రూ.15000 ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. సూపర్ సిక్స్‌లో లేకున్నా 2.90లక్షల మంది ఆటో డ్రైవర్ల కోసం రూ. 436కోట్లు ఖర్చు చేస్తున్నదన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్, టౌన్‌బ్యాంకు చైర్మన్ సుబ్బారెడ్డి, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, కమాల్, మహ్మద్ గౌస్, మునీర్ , జనసేన నేతలు శివకుమార్, జిలాన్ ,మురళీ జడ్పీ సీఈవో ఓబులమ్మ, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆటో యూనియన్ నేత గురుస్వామి పాల్గొన్నారు. అనంత రం ఆటో కార్మికులకు చెక్కును పంపిణీ చేశారు.


ఆటోలో వస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

## అభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయం

జమ్మలమడుగు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలే కాకుండా చెప్పని పథకాలను సైతం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం విజయదశమి కానుకగా ఆటో డ్రైవర్ల సేవలో ఏడాదికి రూ.15 వేల పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించడం పురస్కరించుకుని జమ్మలమడుగులో ఆటో డ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జిభూపేశ్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు చేరింది. అక్కడ ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు ఒక్కో కుటుంబానికి రూ.15 వేలు నగదు పంపిణీ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఆర్డీవో సాయిశ్రీ మాట్లాడుతూ ఏదైనా సమస్యలుంటే ఆటో డ్రైవర్లకు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కాగా జమ్మలమడుగులో లేబర్ ఆఫీసు కడపలో పెట్టారని, అక్కడ రద్దు చేసి వెంటనే జమ్మలమడుగులో ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ నేతలు కోరారు. వెంటనే ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్లకు రూ.17,18,40,000 చెక్కును వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రనాయక్, తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి, సీపీఎం, సీపీఐ నాయకులు ప్రసాద్, దాసు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బిరు సంతోష్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం

బద్వేలుటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడి, ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖచైర్మన్ కేకే చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటోవర్కర్లతో టీటీడీ కళ్యాణమండపం నుంచి బిజివేముల వీరారెడ్డి కళాశాల వరకు రితేష్‌రెడ్డి ఆటో యూనిఫాంను ధరించి ఆటోనడుపుతూ, ఆటోలో ప్రయాణిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రితేష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక గొప్ప విజన్ ఉన్న నాయ కుడన్నారు. ఆటోడ్రైవర్లు సమాజానికి సేవకులని, వారి జీవన ప్రమాణాలు పెంచే దిశగా ఈ పథకం ఒక చారిత్రాత్మకమన్నారు. అనంతరం ఆర్డీఓ చంద్ర మోహన్, ఎంవీఐ శేఖర్‌రావు, మున్సిపల్ కమి షనర్ నరసింహారెడ్డి, సీఐలు లింగప్ప, క్రిష్ణయ్యలు మాట్లాడారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో 1268 మంది లబ్ధిదా రులకు ఒక్కో ఆటోడ్రైవర్‌కు రూ.15వేల చొప్పున వారి ఖాతాల్లో జమకా వడంతో ఆటోడ్రైవర్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, ఎల్ఎస్‌పీ డ్యాం చైర్మన్ రమణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ సుప్రజ, వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, శివయ్యస్వామి, నరసింహానాయుడు, కొలవలి వేణుగోపాల్ పాల్గొన్నారు.


ఆటోలో ప్రయాణిస్తున్న రితేష్‌రెడ్డి

## అట్టహాసంగా ఆటోడ్రైవర్ల పథకం

మైదుకూరు అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని నియోజక వర్గ స్థాయి కార్యక్రమం మైదుకూరులో నియోజకవర్గ స్పెషలాఫీసర్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించారు. స్థానిక రాయల కూడలి నుంచి బైపాస్ వరకు ఆటోలతో ర్యాలీగా వెళ్లి స్థానిక ఎస్‌సీసీఆర్ కళ్యాణ మం డపంలో ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1230 లబ్ధిదారులకు ఈ పథకం ద్వారా ఒక్కరికి రూ.15వేలు చొప్పున వారి ఖాతాలలో జమ అవుతుందన్నారు. ఆటోడ్రైవర్లకు ఆర్థిక సహాయం చేయడం పట్ల సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీసవేతనాల సల హామండలి డైరెక్టర్ దాసరిబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, ఏపీఎస్ ఎల్డీసీ డైరెక్టర్ సుదాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట ఎంపీడీఓలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## వాహనాల రాకపోకలకు మార్గం సుగమం

ఖాజీపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట- రావులపల్లెకు వెళ్లేదారిలోని సిమెంటు రోడ్డుపై ఏర్పడినిపాచిని ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి ట్రాక్టర్‌తో తొలగించి వాహనదారులరుకు ఇబ్బందులు తొలగించారు. గత కొద్దిరోజులుగా వర్షాలు పడుతుండడంతో ఒక్కిలేరుకు ఎక్కువ నీరు రావడంతో నీరు పారి సిమెంటు రోడ్డు పాచికట్టి స్కూటరిస్టులు అదుపు తప్పి కిందపడడంతో పలురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్ వాటిని తొలగింపజేశారు.

## ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు

కొండాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో శనివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగలశశిభూషణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాచకొండ రవీంద్రశర్మ, మాజీసర్పంచ్ పీవీ నరసింహారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దస్తగిరిస్వామి పండుగ

జమ్మలమడుగు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం ప్రాంతాల్లో శనివారం దస్తగిరిస్వామి జెండా (గ్యార్మి) పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం జమ్మలమడుగు పట్టణంలోని బొల్లవరం రామయ్యవీధిలో, పలు వీదుల్లో, రాత్రి, మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల గ్రామంలో పెద్దజెండాలను మెరువణిగా తీసుకెళ్లారు. భక్తులు పాతెహాలు చేసి మొక్కుకున్నారు. తిరిగి జెండాలను ఆయా దర్గాలవద్దకు చేర్చారు.

## క్రీడలను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు జమ్మలమడుగు మండలంలో ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికలకు క్రీడా పోటీలను విజయవంతం చేయాలని పీఆర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. శనివారం జమ్మలమడుగులోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలకు సంబందించి సమావేశం జరిగింది. ఈ క్రీడా పోటీలలో అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. 7వ తేదీ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 8న అథ్లెటిక్స్, 9న యోగా, బ్యాడ్మింటన్, చెస్ క్రీడలు జరుగుతాయన్నారు. మండలస్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ ఈ ఏడు అంశాల్లో పాల్గొని పాఠశాలలవారు ఈనెల 6వ తేదీ సాయంత్రంలోపు పీఆర్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, మండల కోఆర్డినేటర్‌కు తెలియజేయాలని వివరాలకు 7382075809 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఈ క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులు రెవెన్యూ డివిజనల్‌స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు.

## 10 న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

బద్వేలు , అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్‌లో బాగంగా అండర్ -14 అండర్-17 విభాగాలకు చెందిన బాల బాలికలకు స్థానిక జిల్లా పరిషత్, బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 10వ తేదిన టీమ్ గేమ్స్ , ఎస్జీఎఫ్ సెలక్షన్ నిర్వహించ నున్నట్లు పాటశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, మండల స్పోర్ట్ కో ఆర్డినేటర్‌కొండయ్యలు తెలిపారు. మండలస్థాయిలో అథ్లెటిక్స్ బ్యాడ్మింటన్ చెస్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు పాఠశాలలో హాజరు కావాలని తెలిపారు.

## ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలి


సూచనలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఖాజీపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని వెలికితీయాలని ప్రధానోపాధ్యాయుడు బాల అంకిరెడ్డి పేర్కొన్నారు. శనివారం బాలుర హైస్కూలులో వ్యాయామ ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా లీప్‌యాప్ నందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 9, 10 తేదీల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, బ్యాడ్మింటన్, చెస్, క్రీడలకు పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు


నాయకుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న సీఈవో మహమ్మద్ ఆలీ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమించినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవో మహమ్మద్‌ఆలీ తెలిపారు. శనివారం ఆయన ప్రొద్దుటూరు మండలంలో ఉన్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం మైనార్టీల ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలంలో వక్ఫ్‌బోర్డుకు కోట్లు విలువైన ఆస్తులు ఉన్నాయని తెలిపారు. మోడంపల్లె మసీదుకు సంబందించిన కొన్ని ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదులు అందాయన్నారు. వక్ఫ్‌బోర్డు భూముల ఆస్తులను అమ్మడంకానీ, కొనడం కానీ జరుగదని ఆస్తులు కొనేవారు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీ చేసి కొనుగోలు చేసుకోవాలని సూచించారు. మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీద్ ఆదేశాల మేరకు వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిశీలించామన్నారు. త్వరలో వక్ఫ్‌బోర్డు సమావేశంలో ఆస్తుల పరిరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో చర్చిస్తామని తెలిపారు. ఆక్రమణలకు గురైన ఆస్తులపై కేసులు నమోదు చేస్తామని, ఆక్రమణలు తొలగించడానికి సర్వే నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు రాష్ట్ర డైరెక్టర్ బేపారి జాకీర్ అహమ్మద్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు చోర్‌పై విస్తృత ప్రచారం


మహిళలకు వివరిస్తున్న సుధాకర్‌రెడ్డి

చాపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులో శనివారం ఓటు చోర్, గడ్డిచోడ్ అనే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మైదుకూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి ఆయన మహిళలకు కరపత్రాల ద్వారా వివరించారు. గత ఎంపీ ఎన్నికల్లో జరిగిన ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘం చేస్తున్న మోసాలను కూడా ఆధారాలతో ప్రజలకు వివరించారన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2,700 సంతకాలు, చాపాడులో 355 సంతకాలు సేకరించినట్లు ఆయన చెప్పారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణే దేశ సేవ

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణే నిజమైన దేశ సేవ అని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష అన్నారు. శనివారం ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీలోని భగత్‌సింగ్ కాలనీలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి పిలుపుమేరకు ప్రజాస్వామ్య పరిరక్షణే నిజమైన దేశసేవ అని ఇంటింట ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించడం అంటే ప్రజల హక్కులను కాపాడటమే అన్నారు. ఓటు దొంగ గద్దె దిగు అనే నినాదాలతో ఇంటింటికి వెళ్లి ప్రజల్లో ఓటు చోరీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రటరి అప్పపోగుల యల్లయ్య, నాయకులు మౌలాలి, ఖలందర్, గౌస్, చెన్నూరు అబ్బాస్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని క్లినిక్ సీజ్

దువ్వూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు గ్రామంలో నిబంధనలు పాటించిన ఆర్ఎంపీ క్లినిక్‌ను స్థానిక ప్రభుత్వ వైద్యుడు సురేష్‌బాబు సీజ్‌చేశారు. పరిమితికి మించిన వైద్యంను ఇక్కడి ఆర్ఎంపీ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. యాంటీ బయాటిక్స్ వాడటం, సైలైన్ బాటిళ్లు పెట్టడం లాంటివి కనుగొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే క్లినిక్‌లపై మండల వ్యాప్తంగా చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యుడు సురేష్‌బాబు తెలిపారు. ఆయన వెంట వారి సిబ్బంది రాజగోపాల్, చంద్రమౌళి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

కలసపాడు, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): కలసపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ తిమోతిలు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

## ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత : జడ్పీ సీఈవో


అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఓబుళమ్మ

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం ప్రజలకు, పర్యావరణానికి ప్రమాదకరమని ఈ కవర్ల నిషేధానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా సహకరించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ప్రొద్దుటూరు తాలూకా స్పెషల్ ఆఫీసర్ కె.ఓబుళమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రొద్దుటూరు తాలూకాలో ప్లాస్టిక్ నిషేధం అమలుపై ఆమె సమావేశాన్ని నిర్వహించి ప్లాస్టిక్‌కవర్ల తయారీదారులతో మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి ముప్పు వాటిళ్లడమేకాక ప్రజలకు, మూగజీవాలకు ప్రాణాంతకరంగా మారుతుందన్నారు. నిషేధం అమలు పకడ్బందీగా జరిగేలా అధికారులు, వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎల్‌డీవో రామాంజనేయులు, ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, రాజుపాళెం ఎంపీడీవో రామనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రబీ సాగుకు సబ్సిడీ శెనగలు అందించండి

రాజుపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రబీలో ప్రధాన పంట అయిన శెనగ పంట సాగు చేసుకునేందుకు సబ్సిడీతో శెనగలు వెంటనే అందించాలని రైతన్నలు కోరుతున్నారు. గత వారంరోజులుగా ఎరువులు విత్తుకుని పంట పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు శెనగ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో దాదాపు 20వేల ఎకరాలకు పైబడి శెనగ పంటను సాగు చేసుకునేందుకు రైతన్నలు సిద్ధంగా ఉన్నారు. చిన్నశెట్టిపల్లె, పొట్టిపాడు గ్రామాలు కేవలం శెనగపంటలు తప్ప ఇతర పంటలు సాగు చేయరు. దీంతో పంట సాగు చేసుకునేందుకు సబ్సిడీ శెనగలు అందించాలని వారు కోరుతున్నారు. మిగతా పంటల కంటే శెనగ పంట సులభతరం, ఒక వర్షం పడితే చలి మంచుతోనే ఈ పంట పండడం ద్వారా జిల్లాలోనే సెకండ్ ప్లేస్ కింద రాజుపాలెం మండలం పంట చేతికి వస్తుంది. ఇప్పటి వరకు సబ్సిడీ శెనగలపై అధికారులకు స్పష్టత లేక రైతన్నలు త్వరగా శెనగలు అందిస్తే పదును ఆరిపోకముందే పంట సాగు చేసుకోవచ్చునివేడుకుంటున్నారు. అధికారులు స్పందించి నాలుగైదు రోజుల్లో మండలానికి సబ్సిడీ శెనగలు అందించాలని వారు కోరుతున్నారు.

## పోరుమామిళ్లచెరువు ద్వారా నీరు విడుదల

పోరుమామిళ్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని గంగ నీరును కుడి, ఎడమ కాల్వల ద్వారా పోరుమామిళ్ల చెరువుకు మళ్లించి కొండుగారిపల్లె మీదుగా చిన్న చెరువులకు శనివారం నీరందించే కార్యక్రమం చేపట్టామని టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కొండుగారిపల్లె వద్ద బ్రిడ్జిని పరిశీలించి పూజలు నిర్వహించారు. కొండుగారిపల్లె నుంచి బద్వేలు వరకు ఈ కాల్వల ద్వారా చిన్న చెరువులకు నీరందించి ఆయకట్టు రైతులు పొలాలు పండించుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. అంతకు ముందు నీటి విడుదలకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌పీ డ్యాం చైర్మన్ రమణారెడ్డి, సహకార సంఘం చైర్మన్ కల్లూరు వెంకటక్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు కొండా రామక్రిష్ణారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టరు శెట్టెం ప్రతాప్, మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కూటమిపై పోరుకు సిద్ధం


సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ప్యాప్టో నాయకుడు

బద్వేల్లు, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వంపై పోరుకు సిద్ధం కావాలని ప్యాప్టోనేతలు మాదన సవిజయ్‌కుమార్, జీవీ సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డిలు పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 7వ తేదీన ప్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను పూర్తిగా విస్మరించిందని మెరుగైనవేతనాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చి 16 మాసాలు కావస్తున్నా కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఎస్టీయూ, హెచ్‌ఎం ఎ సంఘాల నాయకులు సుధాకర్, శ్రీకాంత్, సుబ్బరాయుడు, దేవానందం, రమేష్‌రాజు, శ్రీనివాసులు, గంజి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



పోరుబాట, బైకు ర్యాలీ నిర్వహించిన ప్యాప్టో నాయకులు

**పోరుమామిళ్లలో:** ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. శనివారం పోరుమామిళ్లలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాప్టో అధ్యక్షుడు కుర్ర చెన్నయ్య, రాష్ట్ర ప్యాప్టో నాయకులు పి.రమణారెడ్డి, సుబ్రమ ణ్యం, సురేంద్రనాధరెడ్డి, సత్తార్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే సమయంలో ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించమని నోరు నెత్తీ కొట్టుకుంటుంటే వినే నాథుడు కరువయ్యారన్నారు, 12వ పీఆర్సీ గడువు సమీపించి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయడం కానీ, మధ్యంతర భృతి ప్రకటించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఈ నెల 7న ప్యాప్టో ఆధ్వ ర్యంలో విజయవాడలోని భారీ ధర్నా చేపడుతున్నామని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రహాసరెడ్డి, క్రిష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, బాలరాజు, చెన్నక్రిష్ణ పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

**మైదుకూరులో:** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా రాష్ట్ర ఉపాధ్యాయ సమాఖ్య (ప్యాప్టో) ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇచ్చిన ఎన్నికల హామీలను విస్మరించి అధికారం చేపట్టి 16 నెలలు అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7వతేదీన విజయవాడలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు వైవీ సుబ్బయ్య, గోశెట్టి రామోహన్, పాలకొండయ్య, చంద్రశేఖర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దారు

ముద్దనూరు అక్టోబర్4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో సభాభవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వైస్ ఎంపీపీ రేణుక అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో రాధాక్రిష్ణవేణి సూచ నల మేరకు అధికారులు వారి వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పై వివరించారు. రేషన్‌కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు డీటీ వరదకిశోర్‌రెడ్డి తెలిపారు. పశువుల ఆరోగ్య పరీక్షల కోసం 1962 మొబైల్ వాహనం అందుబాటులో ఉందని వెటర్నరీ డాక్టర్ భారతీ తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని ఏవో వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.దేనేపల్లిలో మార్గంలో పొట్టి బస్సులు వేయడం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య సభలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## నరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి అభిషేకం, అనంతరం పలురకాల పుష్పాలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వల్లెరవారిపల్లె గ్రామానికి చెందిన కాకాని పెంచలయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కైంకర్యం నిర్వహించారు.